ఆనందమని 'పించన్'

- మూడోరోజూ కొనసాగిన పింఛన్ల పంపిణీ
- రూ.3 వేలు అందించడంపై లబ్ధిదారుల హర్షం
- 'పురం'లో మెగా చెక్ విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక


హిందూపురం: మెగా చెక్కు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక

హిందూపురం: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చాడంటే అది ఏ పనైనా సరే చేసి చూపిస్తారు. చెప్పిన విధంగానే పింఛన్‌ను రూ.3 వేల వరకూ పెంచి తన మాటను నిలుపుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్' అని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక తెలిపారు. హిందూపురం మున్సిపాల్టీ కార్యాలయం ఆవరణలో చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన పింఛన్ కానుకల పంపిణీ కార్యక్రమానికి దీపిక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ దేశంలోనే రూ.3 వేలు పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని సగర్వంగా చెప్పవచ్చునన్నారు. గ్రామ, వార్డు వలంటీర్లు 1వ తేదీనే వచ్చి ఇంటి తలుపు తట్టి పింఛన్‌కానుకలు అందిస్తున్నారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం పాలనలో అందించే అరకొర పింఛన్ కోసం వృద్ధులు, వికలాంగులు గంటల తరబడి పడిగాపులు కాస్తూ క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ఎవరైతే వారికి అనుకులంగా ఉంటారో, లంచాలు ఇస్తారో వారికి పింఛన్ ఇచ్చేదన్నారు. అయితే ఇప్పుడే ఒకరి సిఫార్సు లేకుండా అర్హతే ప్రామాణికంగా పింఛన్ అందిస్తున్న మీ మనవడు జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాంరెడ్డి, కౌన్సిలర్లు ఆసీఫ్‌వుల్లా, రామచంద్ర, షాజియ, మల్లికార్జున, నాగేంద్రబాబు, మల్లికార్జున గౌడ్, గిరి, నాగేంద్రమ్మ, రహమత్ బీ, రోషన్ అలీ, టౌన్‌ఏ బ్లాక్ కన్వీనర్ సాధిక్, పార్టీ నాయకులు బాబు, వెంకటేష్ రెడ్డి, నాగరాజు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఫారూక్, జేసీఎస్ కన్వీనర్ నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: రాష్ట్రంలో ఇచ్చిన హామీలను నేరవేర్చిన ఘనత సీఎం జగన్‌కి మాత్రమే దక్కిందని రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, ఎంపీపీ కవిత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనం ఆవరణలో వైఎస్సార్ పింఛన్ వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.


పెనుకొండ మండలం గుట్టూరులో నూతన పింఛన్లను అందచేస్తున్న జెడ్పీటీసీ శ్రీరాములు


రొళ్లలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మడకశిర మండలం జమ్మానిపల్లిలో ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్


హిందూపురం మండలం గొల్లాపురంలో పింఛన్ అందిస్తున్న వలంటీర్

ఇంటి పెద్ద కొడుకు జగన్


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా ఇంటి పెద్ద కొడుకులా ఆదరిస్తున్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా వలంటీర్ల ద్వారా నేరుగా చేతికి పింఛన్ డబ్బులను అందిస్తున్నారు. చెప్పిన విధంగానే పింఛన్‌ను రూ.2,750 నుంచి రూ.3 వేలు చేశారు. నేను ఎవరిపైనా ఆధారపడకుండా చేసిన జగన్‌కే మా మద్దతు.

– సుబ్బమ్మ, గుట్టూరు, పెనుకొండ మండలం

గతంలో కాళ్లరిగేలా తిరిగాను


వితంతు పింఛన్ కోసం గత టీడీపీ ప్రభుత్వ హయంలో కాళ్లరిగేలా తిరిగాను. అయితే పింఛన్ మాత్రం రాలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కేవలం పింఛన్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేశాను. వెంటనే పింఛన్ మంజూరైంది. ఒకటో తేదీనే తలుపు తట్టి డబ్బులిస్తున్నారు.

– ముత్యాలమ్మ, గోరంట్ల

ఠంచనుగా పింఛన్


ప్రతి నెల ఒకటో తేదీనే ఠంచనుగా పింఛన్ ఇస్తున్నారు. ప్రస్తుతం వయస్సు మీదపడటంతో ఏ పని చేసుకోలేకపోతున్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచడం హర్షణీయం.

– నారాయణప్ప, మల్లసముద్రం, రొళ్ల మండలం

పేదల ఆరోగ్యానికి భరోసా


గుడిబండ: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి


రొద్దం మండలం రెడ్డిపల్లిలో వృద్ధుడికి కళ్లద్దాలు అందజేస్తున్న దృశ్యం

రొద్దం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా ఇస్తోందని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి సచివాలయ పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

గోరంట్ల: మండల పరిధిలోని వానవోలులో రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం సర్పంచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యులు రోగులను పరీక్షించారు. ఎంపీడీఓ రఘునాథగుప్తా, ఎంఈఓ జాన్‌రెడ్డప్ప, ఉప సర్పంచ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రభుత్వ పాఠశాల వద్ద రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. 200 మంది వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ గంగాదేవి, వైద్యుడు హరికుమార్, ఎంపీటీసీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని మందలపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఎంపీడీఓ రామారావు, వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. 266 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు, కంటి అద్దాలు అందజేశారు. .

పరిగి: మండలంలోని ఊటుకూరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. పరిగి, ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు స్వరూపరెడ్డి, సురేష్‌కుమార్, రూబీ ఆధ్వర్యంలో స్పెషలిష్టు డాక్టర్ ఆఫ్తాబ్ నేతృత్వంలో వైద్య చికిత్సలను నిర్వహించారు.

మెరుగైన సేవలందించడమే ధ్యేయం


ఖాతాదారులకు ఎఫ్‌డీ బాండ్లు అందిస్తున్న దృశ్యం

మడకశిర: ఏపీజీబీ (అనంత ప్రగతి గ్రామీణ బ్యాంక్) ఎఫ్‌డీలపై అత్యధికంగా వడ్డీ రేటు చెల్లిస్తున్నట్లు ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రవీంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ఏపీజీబీ బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎఫ్‌డీలపై అందిస్తున్న 8.3 శాతం వడ్డీరేటుపై ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీఎం సంజీవప్ప, బీఎం ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నూతన భవనంలోకి ఏపీజీబీ

అగళి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల పక్కనున్న భవనంలో 20 ఏళ్లుగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలు అందిస్తోంది. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రస్తుతం పోలీసుస్టేషన్‌కు ఎదురుగా ఉన్న భవనంలోకి బ్యాంకును మార్చామని బ్రాంచ్ మేనేజర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఖాతాదారులు గమనించాలని సూచించారు.

దేమకేతేపల్లిలో సర్వే రాళ్ల ఏర్పాటు


జగనన్న భూరక్ష సర్వే రాయి నాటిన దృశ్యం

చిలమత్తూరు: మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీలో జగనన్న భూరక్ష సర్వే నంబరు రాళ్లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం సర్పంచ్ తిరుమలేష్ కొబ్బరి కాయ కొట్టి తొలి రాయి నాటారు. కాగా దేమకేతేపల్లి పంచాయతీలో రీ సర్వే పూర్తయినట్టు రీసర్వే డీటీ యూనిస్ తెలిపారు. మండల సర్వేయర్ సరేష్, సచివాలయ సర్వేయర్ కృపావతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి మహోత్సవం

పరిగి: అయ్యప్ప మాలాధారుల ఇరుముడి మహోత్సవం శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో దాదాపు 25 మంది అయ్యప్ప మాలాధారులకు ఇరుముడిని కట్టారు.అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తర్వాత శబరిమలకు బయల్దేరి వెళ్లారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

గోరంట్ల: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం ప్రాంగణంలో శుక్రవారం ఏపీటీఎఫ్ 1938 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. మండల విద్యాశాఖ అధికారి జాన్‌రెడ్డప్ప , ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల శాఖ అధ్యక్షుడు తిరుపాల్‌నాయక్, గౌరవాధ్యక్షుడు శ్రీరామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

చిలమత్తూరు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, అధ్యక్షుడిగా సుందర్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథరెడ్డి, కో ఆప్టెడ్ అధ్యక్షుడిగా పాపిరెడ్డి తదితరులను ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర తెలిపారు.

వైభవంగా బ్రహ్మ రథోత్సవం


రథంపై కొలువైన సీతారాములు


సీతారాముల బ్రహ్మరథోత్సవం

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రంలో గోందావళి సద్గురు బ్రహ్మ చైతన్య స్వామి వారి ఆరాధన మహోత్సవంలో భాగంగా సీతారాముల బ్రహ్మ రథోత్సవం శుక్రవారం కనుల పండువగా సాగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం సీతారాముల విగ్రహాలను బహ్మరథంపై ఊరేగించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

- అమృత్–2 కింద రూ.87 లక్షలతో పనులు
- పనుల ప్రారంభానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే శంకరనారాయణ


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: నగర పంచాయతీ పరిధితో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. రూ.87 లక్షలతో పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ శుక్రవారం పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు.

20 వార్డులు 40 వేల జనాభా..

కొంత కాలంగా పట్టణంలో పైప్‌లైన్ సమస్యలతో పాటు ఇతర కారణాలతో తాగునీటి సమస్య ఏర్పడింది. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ప్రత్యేక చర్యలు చేపట్టి నగర పంచాయతీ దాహార్తిని తీర్చడానికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. దీంతో అమృత్–2 కింద సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు నగర పంచాయతీ పాలక వర్గం సిద్ధమైంది. 20 వార్డులున్న పెనుకొండ నగర పంచాయతీలో 42 వేల జనాభా ఉన్నారు. నాలుగు ట్యాంకులు ప్రస్తుతం ఉండగా మరో 9 ట్యాంకులను అమృత్–2 స్కీం కింద నిర్మించనున్నారు. పైప్‌లైన్ ఏర్పాటుకు సంబంధించి అధికారులు ఇప్పటికే పట్టణంలో డంప్ చేశారు.

ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం..

పెనుకొండ నగర పంచాయతీ ప్రజల దాహార్తి తీర్చడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని షీఫారం వద్ద నుంచి పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వరకు చేపట్టనున్న పైప్ లైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ జనాభా రోజురోజుకూ పెరిపోతోందని, అలాగే పైప్‌లైన్లు పగిలిపోవడం వంటి సమస్యలతో ప్రజలకు నీటి సరఫరా ఇబ్బందిగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో రూ. 87 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. పలు కాలనీల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించనుండటంతో నీటి సరఫరాకు ఏ ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, భాస్కర్‌నాయక్, రామాంజినేయులు, తయూబ్, సద్దాం, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు కొండలరాయుడు, కోఆప్షన్ మెంబర్లు నేమతుల్లా, నాయకులు బాబు, శ్రీరాములు, గణేష్, యాజిన్, ఫరీద్ క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

పెనుకొండ వాసుల దాహార్తిని తీర్చేందుకు శాశ్వత ప్రాతిపదికన అమృత్–2 కింద పనులు చేపట్టనున్నాము. షీఫారం, జర్నలిస్ట్ కాలనీ, ఆల్విన్ కాలనీ, నారాయణమ్మ కాలనీ, వజ్రాలపేట, నాగులకట్ట వీధి, డీఎస్పీ కార్యాలయం ఏరియా, జీబీసీ కాలనీ తదితర ప్రాంతాలకు రోజూ తాగునీరు క్రమం తప్పకుండా సరఫరా చేస్తాం. రానున్న 30 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని ఈ పనులు చేపట్టనున్నాము. భవిష్యత్తులో పెనుకొండ జనాభా 80 వేలకు పెరిగినా ఎలాంటి సమస్య ఉండదు.

– వంశీకృష్ణ భార్గవ్, కమిషనర్, పెనుకొండ

క్లుప్తంగా

నేడు పెనుకొండకు మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖా మంత్రి ఉషశ్రీచరణ్ శనివారం పెనుకొండలో పర్యటించనున్నారు. పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన నేపథ్యంలో ఆమె మొదటి సారిగా పెనుకొండకు వస్తున్నారు. కళ్యాణదుర్గంలోని క్యాంపు ఆఫీస్ నుంచి ఉదయం 9:30 గంటలకు 400 కార్ల ర్యాలీతో నూతిమడుగు, తగరకుంట, కనగానపల్లి మీదుగా మామిళ్లపల్లి, చెన్నేకొత్తపల్లి మీదుగా గుట్టూరు చేరుకుంటారు. అక్కడి నుంచి పార్టీ శ్రేణులతో కలసి పెద్దచురువుకట్ట ఆంజనేయ స్వామి దేవాలయం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెనుకొండ పట్టణంలోని బాబయ్య దర్గాలో ప్రార్థనలు నిర్వహించి అనంతరం ఆర్అండ్‌బి అతిథి గృహం చేరుకుని వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం పాలసముద్రం సమీపంలోని గేట్‌వే వద్ద ఉన్న ఇంటికి చేరుకుంటారు.

ఎస్‌డీఎంసీ ప్రశస్తికి నాగేశ్ ఎంపిక


నాగేశ్

పావగడ: స్థానిక ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి సమితి (ఎస్‌డీఎంసీ) ఉత్తమ అధ్యక్షుడిగా రాంపురం నాగేశ్ ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన జ్ఞాన విజ్ఞాన సమితి – 2023 ఏడాదికి అనితా కౌల్ సంస్మరణార్థం రాష్ట్రస్థాయి ఎస్‌డీఎంసీ ప్రశస్తికి తుమకూరు జిల్లా విభాగం పావగడ చెందిన రాంపురం నాగేశ్ ఎంపిక చేశారు. కే రాంపురానికి చెందిన నాగేశ్ అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి

హిందూపురం టౌన్: పట్టణంలోని బాపూజీ నగర్ మున్సిపల్ ప్రైమరీ పాఠశాల, ఎన్టీఆర్ కాలనీలోని మున్సిపల్ పాఠశాల ఆవరణలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సునీత, నాగేంద్రమ్మ, అంజలి, హౌసింగ్ ఏఈ నారాయణరెడ్డి, బీజేపీ నాయకులు అమర్ దేవేంద్ర, ఆదర్శ్ కుమార్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న చైర్మన్, కమిషనర్

పెనుకొండ: పట్టణంలోని ఎగువగడ్డలో నాయీ బ్రాహ్మణుల నూతన కమ్యూనిటీ భవన నిర్మాణానికి నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ శుక్రవారం భూమి పూజ చేశారు. 6 సెంట్ల స్థలంలో రూ.5 లక్షలతో కమ్యూనిటీ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు బాబన్న, రామాంజి, ప్రభాకర్, అనంతరాములు, అంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపును అడ్డుకున్న కార్మికులు


పనులను అడ్డుకుంటున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు, నాయకులు

హిందూపురం: పట్టణంలో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ రెగ్యులర్ కార్మికులు శుక్రవారం తొలగించే ప్రయత్నం చేశారు. అయితే కమ్యూనిస్టు నాయకులతో కలసి అవుట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు గాంధీసర్కిల్ వద్ద పనులను అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. పనులు చేసేవారిని అడ్డుకుంటే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మరో రెండు రోజుల్లో పట్టణమంతా శుభ్రం చేసే చర్యలు చేపడతామని కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో రామచంద్రప్ప అనే వ్యక్తి వద్ద నుంచి 50 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మధు రామచంద్రుడు తెలిపారు. మద్యం ప్యాకెట్లను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

సందడిగా 'ఆడుదాం ఆంధ్రా'


క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉన్న క్రీడాకారులు

పెనుకొండ రూరల్: మండలంలోని గోనిపేటలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా అధికారులు క్రికెట్ పోటీలను నిర్వహించారు. పెద్ద ఎత్తున క్రీడాకారులు తరలిరావడంతో గోనిపేటలో సందడి వాతావరణం నెలకొంది.

జాప్యం లేకుండా పనులు

మడకశిర: పట్టణంలోని ప్రధాన సర్కిళ్లలో నిర్మిస్తున్న మరుగుదొడ్లను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ ఏఈ మురళి తెలిపారు. శుక్రవారం మధుగిరి సర్కిల్‌లో నిర్మిస్తున్న మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. జాప్యం చేయకుండా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

మట్కా బీటర్ అరెస్ట్

మడకశిర: పట్టణంలోని హిందూపురం రోడ్డులో శుక్రవారం తిప్పేస్వామి అనే మట్కా బీటర్‌ను అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. అతని నుంచి రూ. 7,520 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అతను సైకిల్‌షాపు నిర్వహిస్తూ మట్కా రాస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


రామన్న (ఫైల్)

గుడిబండ: మండల పరిధిలోని ఫళారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామన్న (51) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. మృతునికి భార్య కెంపక్క, కుమారుడు తిప్పేస్వామి, మేఘరాజు ఉన్నారు. విషయం తెలుసుకొన్న సర్పంచ్ సతీష్, మాజీ సర్పంచ్ ఈరలక్కప్ప వైఎస్సార్‌సీపీ నాయకులు.. రామన్న మృతదేహం వద్ద నివాళులర్పించారు.

దేవాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం


కమిటీ సభ్యులకు డీడీని అందజేస్తున్న దృశ్యం

లేపాక్షి: లేపాక్షి సమీపంలోని పెద్ద చెరువు ఉన్న లక్ష్మీ తిరుమల దేవరప్ప దేవాలయం అభివృద్ధికి దాతలు రూ.లక్ష విరాళంగా అందించారు. ధర్మస్థల అభివృద్ధి సంస్థ అధికారులు చిక్కబళాపురం జిల్లా డైరెక్టర్ ప్రశాంత్, ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు నాయక్ ఆలయ కమిటీ సభ్యులకు డీడీని అందజేశారు.